డీఈఓకు సత్కారం



అబిడ్స్: నగర డీఈఓ రోహిణిని టీఎస్జీవోస్ అసోసియేట్ అధ్యక్షుడు, హైదరాబాద్ జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ అధ్యక్షులు కే.ఆర్ రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బుధవారం ఎల్బీ స్టేడియం సమీపంలోని డీఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమెను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యారంగ వ్యాప్తికి అందరూ చేస్తున్న కృషి అమోఘంగా అన్నారు. ఎస్‌డీ ప్రేమ్ కుమార్, జయంత్ రెడ్డి, ఫిరోజ్ అహ్మద్, ఠాకూర్, సుదర్శన్, విజయలక్ష్మి, శ్రీకాంత్, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజేందర్, అర్చన, మంజు, వెంకటేష్, రమేష్, లావణ్య, అరుణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



ఎమ్మెల్సీ ఆమీర్ అలీఖాన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న తిరుపతి శ్రీనివాస రావు

చార్మినార్: సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఆమీర్ అలీ ఖాన్‌ను కోరినట్లు వైఎస్ఆర్‌సీపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తిరుపతి శ్రీనివాస రావు తెలిపారు. బుధవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ..స్థానిక సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరామన్నారు. పాతబస్తీ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి ప్రత్యేక నిధులను కేటాయించే ప్రయత్నం చేయాలని కోరామన్నారు.

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి



ట్రాఫిక్ ఏసీపీకి ఆహ్వానపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

చార్మినార్: ఈస్ట్ చార్మినార్ మైదాన్ ఖాన్ చౌక్‌లోని బాలాజీ మందిరంలో జరగనున్న వైకుంఠ ఏకాదశి వేడుకలను పురస్కరించుకొని ఇలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చార్మినార్ ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్‌ను నిర్వాహకులు కోరారు. ఆలయం ప్రధాన అర్చకులు శృంగరం రమణాచార్యులు, భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి సభ్యులు ప్యారసాని వెంకటేష్ తదితరులు బుధవారం ఆయనను కలిసి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు.

ముదురుతున్న పైప్‌లైన్ వివాదం



సమస్యను విన్నవించుకుంటున్న రైతులు



మాట్లాడుతున్న బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబీన్

- రైతు బజార్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్
- రైతు బజార్ నుంచి లైన్ వేయరాదని కూరగాయల రైతుల ఆందోళన

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా రైతుబజార్‌లో పైప్‌లైన్ వివాదం రోజు రోజుకూ ముదురుతుంది. అసలే ఇరుకుగా ఉన్న రైతు బజార్‌లో నిత్యం ఇబ్బందులు పడుతుంటే.. అందులో నుంచే ఎగువ బస్తీలకు సంబంధించిన మురుగు నీటి కాలువను రైతుబజార్ మధ్యలో నుంచి వేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమవడంతో కూరగాయల రైతులు ఆందోళన బాటపట్టారు. 45 రోజుల నుంచి అటు జీహెచ్ఎంసీ అధికారులు.. ఇటు కూరగాయల రైతుల మధ్య ఈ వివాదం కొనసాగుతుంది. ఈ క్రమంలోనే రైతులు ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి విన్నవించుకోవడంతో పాటు ఈ నెల 7న జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి జడ్‌సీకి సమస్యను విన్నవించుకున్నారు.

రైతు బజార్‌ను సందర్శించిన ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్..

పైప్‌లైన్ వేసేందుకు రైతుబజార్ ఎస్టేట్ అధికారులు, రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో బుధవారం ఉదయం బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబీన్, జోనల్ కమిషనర్ వెంకన్న రైతు బజార్‌ను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పైప్‌లైన్ వేసే రూట్‌ను పరిశీలించారు. ఎగువన ఉన్న మదీనా కాలనీలో లెవలింగ్ సమస్య కారణంగానే రైతుబజార్ మీదుగా లైన్‌ను వేయాల్సి వస్తుందని అధికారులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. డ్రైనేజీ మురుగు నీరు రైతుబజార్‌లో లీకేజీలు అవుతుందని, మ్యాన్‌హోళ్ల పైకప్పుల నుంచి వచ్చే దుర్వాసనతో ఇక్కడ కూరగాయల వ్యాపారం దెబ్బతింటుందని రైతులు చెప్పుకొచ్చారు. ఈ సమయంలో కొందరు మజ్లిస్ నాయకులు రైతుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందు పేర్కొన్నట్లుగా రైతు బజార్‌లో రెండు గేట్ల వైపు రెండు లైన్లు కాకుండా ఒకే గేట్ ఒక లైన్‌ను మ్యాన్‌హోల్ రాకుండా వేస్తామని అధికారులు చెప్పి వెళ్లిపోయారు.

ఇబ్బందులు కలగకుండా చూస్తాం: ఎమ్మెల్యే

రైతు బజార్‌కు ఎగువన ఉన్న మదీనా కాలనీ ప్రజలకు, ఇటు రైతుబజార్ ఎస్టేట్ అధికారులు, రైతులకు ఇబ్బందులు లేకుండా లైన్ వేస్తామని ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మీడియాతో తెలిపారు. మదీనా కాలనీలో లెవలింగ్ సమస్య ఉందన్నారు. రైతుబజార్‌లో కూడా మ్యాన్‌హోల్ ఇవ్వకుండా త్వరితగతిన పైప్‌లైన్ వేస్తామన్నారు.

మా పొట్ట కొట్టొద్దు..



ఊరిలో పండించిన కూరగాయలను ఏళ్ల తరబడి నుంచి ఈ రైతుబజార్‌కు తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. దాదాపు 200 మంది రైతులం విక్రయాలు జరుపుతుండగా రెండు వేల మంది వరకు వినియోగదారులు వస్తుంటారు. ఇప్పటికే ఇరుకుగా ఉన్నప్పటికీ సర్దుకొని జీవనోపాధి పొందుతున్నాం. అలాంటి రైతు బజార్‌లో భారీ పైప్‌లైన్లు వేస్తే నిత్యం మురుగునీరు పారే అవకాశం ఉంది. అధికారులు ఆలోచించి ప్రత్యామ్నాయ రూట్‌లో లైన్ వేసుకోవాలి.

– యాదమ్మ, రైతు, నేదునూర్

రైతు బజార్‌లో ఇప్పటి వరకు లైనే లేదు..



రైతుబజార్‌కు సంబంధించిన డ్రైనేజీ పైప్‌లైన్ వెనుక భాగంలో పోలీస్ స్టేషన్ వైపుకు కొనసాగుతుంది. వర్షం నీరు పోవడానికి మాత్రమే రైతు బజార్‌లో నుంచి బయటికి చిన్న పాటి లైన్ కొనసాగుతుంది. ఎగువన డ్రైనేజీ లైన్ ఎప్పుడైనా స్తంభిస్తేనే తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. అలాంటి భారీ లైన్ రైతుబజార్‌లో వేస్తే ఇక్కడి నుంచి ఖాళీ చేసి పోవాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.

– ఆవుల కుమార్, రైతు, కోళ్ల పడకల్

పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలి

లంగర్‌హౌస్: పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో ఉన్నా కూడా ఎదుటి వారి ప్రలోభాలకు తలొగ్గకుండా పార్టీ కోసం పనిచేసిన తమను గుర్తించాలని కార్వాన్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు చంటిబాబు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన సందర్భంగా చంటిబాబు ఆధ్వర్యంలో కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రితో తమ బాధను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 28 ఏళ్లుగా కాంగ్రెస్‌లోనే ఉండి పార్టీ కోసం పనిచేస్తున్నామని కాని ఇప్పుడు తమను గుర్తించకుండా వేరే వారిని గుర్తించడం చాలా బాధాకరమన్నారు.



మంత్రి పొన్నంతో మాట్లాడుతున్న చంటిబాబు

నాయకులు పరమానందం, చంద్రశేఖర్, శ్రీకాంత్, శోభాపాండే తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఫలక్ నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఫలక్‌నుమా ఓహెచ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఫలక్ నుమా, పలక్ విల్లా, మదీన కాలనీ, ఎమ్మార్వో ఆఫీస్, రైతు బజార్, బస్ డిపో, ఇంజన్ బౌలి, జహనుమా, చార్ చమన్, సర్వర్ జంగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

సన్మానం



అబిడ్స్: సౌత్‌వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మహ్మద్ ఇక్బాల్ సిద్దికికి గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ సిద్దికి మాట్లాడుతూ..అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ అహ్మద్, సయ్యద్ ఖలీల్, సయ్యద్ జాఫర్, రెహ్మాన్ పాల్గొన్నారు.

మరిన్ని పార్కుల ఏర్పాటుకు చర్యలు



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: ప్రజల సౌకర్యార్థం మరిన్ని పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ తెలిపారు. రెయిన్‌బజార్ డివిజన్ సుబుర్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ పార్కును బుధవారం ఆయన కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రెయిన్‌బజార్ డివిజన్‌లో ప్రజలకు వాకింగ్, చిన్నారులు ఆడుకోవడానికి ఆట సామగ్రితో మంచి ఆహ్లాదాన్ని, ఆక్సిజన్ అందించే మొక్కలతో ఏర్పాటు చేసిన పార్కును అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, క్రీడా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులను మార్కుల కొలమానంతో మాత్రమే చూడడం విద్యా వ్యవస్థలో చెడు సంప్రదాయం ఉందని శాసన మండలి సభ్యుడు కోదండరాం అన్నారు. విద్యార్థులను ఆసక్తి ఉన్న ఇతర రంగాల్లోనూ ప్రోత్సహించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఆయన సూచించారు. బుధవారం రవీంద్రభారతిలో కేర్ మోడల్ హైస్కూల్ 32వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం నడుపుతున్న కేంద్రీయ విద్యాలయాల తరహాలో ప్రభుత్వ పాఠశాలలను నడపాలని ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. అంతకు ముందు విద్యార్థుల



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ ఏబీ.భూషణ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆవుల పద్మ, కార్పొరేటర్ అమృత, పాఠశాల అధ్యక్షుడు ఆవుల రాంచందర్‌లతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ భద్రతపై అవగాహన ర్యాలీ

సంతోష్‌నగర్: ట్రాఫిక్ సేఫ్టీ అవగాహన మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఐ.ఎస్.సదన్ క్రాస్ రోడ్డు నుంచి మాతృశ్రీ కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ విశ్వ ప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులను పట్టుకొని ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ..రోడ్లపై ప్రయాణించేటప్పుడు వాహనదారులు అప్రమత్తంగా



ఉండాలని సూచించారు. ఈ ర్యాలీలో ట్రాఫిక్ ఏసీపీ చంద్ర కుమార్, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇ.నర్సింహా నాయక్, ఐ.ఎస్. సదన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్

చాంద్రాయణగుట్ట: బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎండు గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు అంతరాష్ట్రీయ గంజాయి విక్రేతలను సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి తొమ్మిది కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశాకు చెందిన చాందన్ మజ్జీ(36), బిజయ్ టాక్రీ(51) గంజాయిని విక్రయించాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 2న బిజయ్ టాక్రీ మాచీఘాటీలో బోల్ అనే వ్యక్తి వద్ద రూ.15 వేలు వెచ్చించి తొమ్మిది కిలోల గంజాయిని కొనుగోలు చేశాడు. ఈ నెల 4న గంజాయి తీసుకొని నగరానికి వచ్చాడు. 7న బండ్లగూడలోని సాదత్‌నగర్ రోడ్డులో విక్రయించేందుకు యత్నిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసులు దాడులు జరిపి నిందితులను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు బోల్ పరారీలో ఉన్నాడు. వారి వద్ద నుంచి రూ.2.94,000ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా గోదాదేవి పాశురం పూజలు



జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి ఆలయంలో బుధవారం గోదాదేవి పాశురం పూజలు, వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస వేడుకల్లో గోదాదేవి అమ్మవారి 30 పాశురాలలో భాగంగా మహిళలు సాయంత్రం పాశురాలు చదివి హారతులు ఇచ్చారు. ఆలయ ప్రతినిధి శేషాచారి మాట్లాడుతూ..ఈ నెల 11న చివరి పాశురాంలు మహిళలు చదువుతారని, అనంతరం హారతులు ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

కోర్టుకు గైర్హాజరైన ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

సిటీ కోర్టులు: కాంగ్రెస్ నేత, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ 2018 ఎన్నికల సమయంలో నమోదైన కేసుకు సంబంధించి బుధవారం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగిన విచారణకు గైర్హాజరయ్యారు. ఆయన తరఫున న్యాయవాది నరేందర్ పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం తదుపరి విచారణను ఫిబ్రవరి 13వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన అనిల్‌కుమార్ యాదవ్ తన అభిమానులు, కార్యకర్తలతో పాదయాత్ర సందర్భంగా అడిక్‌మెట్ నుంచి రాంనగర్ గుండు వరకు సమారు 100 ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించారని ఫిర్యాదు రావడంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుల విచారణ చేపట్టిన ప్రజాప్రతినిధుల కోర్టు జడ్జి శ్రీదేవి ఆయన గైర్హాజరు కావడంతో విచారణను వాయిదా వేశారు.

అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయించాలి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను ఆయన కోరారు. నియోజకవర్గంలో ప్రస్తుతం రూ.292 కోట్లతో వరద నీటి పైప్‌లైన్, వరద నీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం ఈ పనులు చివరి దశలో ఉన్నాయని ఆయన అన్నారు. ఈ పనులు పూర్తి కాగానే కొత్త రోడ్లు వేయడానికి చొరవ చూపాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను కోరారు. కార్వాన్‌లోని టోలిచౌకీ, గోల్కొండ, నానల్‌నగర్, కార్వాన్ తదితర డివిజన్లలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని ముఖ్యంగా భారీ వరద నీటి పైప్‌లైన్‌లు



కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

వేసిన ప్రాంతాలలో రోడ్లు గుంతలయంగా ఉన్నాయని ఆయన కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు

చార్మినార్: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా డిమాండ్ చేసింది. ఈ మేరకు బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ బహదూర్‌పురా తహసీల్దార్ చంద్రశేఖర్‌కు బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు వినతిపత్రం అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల హామీలలో భాగంగా కామారెడ్డి బహిరంగ సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిన విధంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, కార్యాలయం ఇన్‌చార్జి ప్యారసాని వెంకటేష్, ఓబీసీ మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, కో కన్వీనర్ ధర్మతేజ, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింగరావు, కార్యదర్శి గౌరీశంకర్ సోని, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిరంజన్ బాబు తదితరులు ఉన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

గోల్కొండ: పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు పాఠశాలల నిర్వాహకులు కృషి చేయాలని గోల్కొండ మండల డిప్యూటీ ఐఓఎస్ మహ్మద్ బషీర్ అన్నారు. బుధవారం గోల్కొండలోని డిప్యూటీ ఐఓఎస్ కార్యాలయంలో పలువురు పాఠశాలల వారు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో కూడా విద్యార్థులకు అన్ని రకాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్



మహ్మద్ బషీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మహ్మద్ నవాజ్‌తో పాటు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

గంజాయి తాగి తిరుగుతున్న వ్యక్తికి జైలు

గౌలిపురా: గంజాయి తాగి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని ఐదు రోజుల జైలు శిక్ష విధించిన ఘటన భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. షాజహాన్ ఫంక్షన్ హాల్ ప్రాంతానికి చెందిన మన్సూర్ అలం (24) గంజాయి తాగుతూ అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు మన్సూర్‌ను అదుపులోకి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మన్సూర్‌ను బుధవారం కోర్టులో హాజరుపరచగా పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడికి ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

పాత వారికే షాపులు కేటాయించాలి

అఫ్జల్‌గంజ్: బేగంబజార్ చేపల మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన భవనంలో షాపులను పాత వారికే కేటాయించాలని గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి కృష్ణగుప్తా డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బేగంబజార్ ఫిషర్‌మెన్ అసోసియేషన్ జల క్షత్రియ ప్రతినిధుల అభ్యర్థన మేరకు చేపల మార్కెట్‌లో సందర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ..భవనం నిర్మించి రెండేళ్లు గడిచినా లబ్ధిదారులకు షాపులు కేటాయించడంలో నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. కిసాన్‌మోర్చా కార్యదర్శి రాజేందర్ శర్మ,



కార్వాన్ కన్వీనర్ గోదా లక్ష్మీకాంత్ యాదవ్, జల క్షత్రియ సమాజ్ అధ్యక్షులు ప్రకాష్ సింగ్, కార్యదర్శి సుధీర్ సింగ్, కోశాధికారి రాజ్‌కుమార్ సింగ్, నాయకులు బజరంగ్ సింగ్, శీతల్ సింగ్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

గౌలిపురా: బీజేపీ యువమోర్చా భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో ఛత్రినాక చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు శివచంద్రగిరి మాట్లాడుతూ..బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. అర్జున్, బిట్టు,



నర్సింగ్, సిరివెన్నెల, అనిరుథ్, మహేశ్, సచిన్, సుభాష్, రవి, రోహన్, సాకేత్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సుల్తాన్‌బజార్: తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆరోపణలు చేసినప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు, ర్యాలీలు చేయాల్సింది కానీ, బాధ్యత గల ప్రభుత్వానికి చెందిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ కార్యాలయంపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీ కార్యాలయంపై దాడిచేసిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలతో భేషరతుగా క్షమాపణ చెప్పించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పరామర్శ

బహదూర్‌పురా: రాష్ట్ర బీజేపీ కార్యాలయ ఎస్సీ మోర్చా నాయకుడు బైరి నందు రాజును కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం పరామర్శించారు. బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దాడి చేయడంతో బైరి నందురాజ్ తలపై గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బండి సంజయ్ బహదూర్‌పురాలోని రాంనాస్‌పు



రాకు చేరుకొని బైరి నందు రాజ్‌ను వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని సూచించారు.